గుండెలమీద కుంపటి

మధ్యాన్నం పన్నెండు గంటలు కావస్తోంది. రైలు మావూరి స్టేషన్లో ఆగేసరికి ఎండ పెళ్లుమని కాస్తోంది. వర్షాకాలపు ఎండేమో, ఉక్కపోసి కిత కితలు పెడుతోంది.

టెలిగ్రామిచ్చినా స్టేషనుకి రాలేదీయన. ఆర్నెల్లయింది నేను పుట్టింటికి వెళ్ళి. పాపాయి నెత్తుకుని ఇదే రావడం. అసలింకా రావాలని లేకపోయినా శ్రావణమాసం నోము మాయింట్లో నోచుకోడవే ఆనవాయితీ అవడాన్ని ఒచ్చేశాను.

ఎలా లేదనుకున్నా సామాన్లు ఎక్కువయ్యాయి. వెళ్ళేటప్పుడు పెట్టె హోల్డాలే పట్టుకెళ్ళేను. వాళ్ళిచ్చిన ఊరగాయ జాడీ ఒకటీ, పాపాయి సామానుతో ప్లాస్టిక్ బుట్ట ఒకటీ, వేణ్ణీళ్ళతో థర్మాస్ ఫ్లాస్కు- ఇలా ఓ చిన్న ట్రాన్స్ఫర్‌కి అయినంతసామానైంది. కూలి వాళ్ళూ రిక్షావాళ్ళూ ఒంటరి ఆడదాన్ని చూసీ, సామాను చూసీ నాదగ్గర రావలసిన దానికంటె ఎక్కువ డబ్బులు గుంజుకుందికి ప్రయత్నిస్తున్నారు.

పావు గంట సేపు చూశాను. ఇంకా రాలేదు ఈయన రిక్షా మాట్లాడుకొని ఆయన మీద విసుక్కుంటూ అందులో కూచున్నాను.

పోనీ ఇంటి దగ్గరైనా ఉంటారన్న ధైర్యంతో వస్తే, ఇల్లు తాళం పెట్టేసివుంది. నాకు నిస్సహాయతవల్ల కోపం పట్టలేనంతగా ఒచ్చేసింది. వీధి వసారాలో సామాను పెట్టించి ఏడుస్తున్న పాపా యిని సముదాయిస్తూ దిక్కులు చూస్తున్నాను.

ఇంతలో ఎవరో వొకావిడ వచ్చి పోరుగింటామెనని చెప్పింది, ఇంతకు ముందు ఉండేవాళ్ళు మారిపోయి నట్టున్నారు. ఆవిడైనా పాపని ముద్దులాడుతూ కూచుందేకాని తాళం తనదగ్గిరుం దని బైటపెట్టనేలేదు. నేను ఆయనమీద విసుక్కుంటూ వుంటే 'అయ్యో' ఈ యింటి తాళంచెవి వొకటి నా దగ్గర వుండమ్మా. పని మనిషి వొస్తే యిమ్మన్నారు.' అంటూ కొంగు ముడి విప్పి తాళం చెవి నా చేతికిచ్చి వెళ్ళింది.

పోనీ ఎలాగో తాళం వుంచేరని సంతోషిస్తూ, తలుపు తీసి లోపలికి వెళ్ళేను. పాపని మంచం మీద పడుకోబెట్టాను, బారసాలకి "వొచ్చిననాడు నువ్వు మళ్ళీ ఇంటికొచ్చే నాటికి చూసొ్కో, ఫస్టు క్లాసయిన ఉయ్యాలా మంచం కొని యింట్లో వేల గడుతున్నామ్" అని డాబులు కొట్టిన పెద్దమనిషి-ఉయ్యాలా లేదు మంచమూ లేదు!

అయితే, ఆయన ధర్మంచా అని యిల్లుమాత్రం అరణ్యంలా చెయ్యలేదు. సామానంతా ఎక్క చేతిమీద యింట్లో పెట్టి

కున్నాను... వీధి తలుపు గడియవేసి అలా బాత్రూమ్ కేసి వెడదామని అనుకుంటున్నాను.

'సార్!' అని కొక ఆడ గొంతుక.

తలుపు తీశాను.

చేతిలో కేరియర్ లేకపోతే ఎవరో పొరుగమ్మ కాబోలను కొనేదాన్ని.

హవాయి చెప్పులు, పద్దెనిమిది రూపాయల వెరైటీ కాశ్మీరు సిల్కు చీరా. కుడిచేతికి రెండు బంగారపు గాజులూ, ఎడం చేతికి దాదాపు డజను ఎర్రటి మట్టిగాజులూ, నడుంమీదికి వాయిల్ జాకెట్టూ ధరించిందా మనిషి. తల నున్నగా దువ్వుకుంది. తల్లో పెట్టుకున్న చేమంతులు నేను పక్కకి వొంగి చూడక పోయినా, అవే తొంగి చూస్తున్నాయి. కొత్తగా, ఒత్తుగా నల్లగా వున్నా మంచి నిగనిగా, అందం వున్నాయా మనిషికి.

'ఎవరు నువ్వూ?' అన్నాను.

'పనిమనిషినండి' చిరునవ్వుతో. 'నువ్వెవరు?' అన్న ధీమాతో అంది.

'ఊఁహూఁ! ఈ వేళప్పుడొచ్చావేం?'

'మరి—అన్నం తేవద్దండీ?'

'అయితే ఆ పిలుపేమిటి, సార్ అంటూను!—అయ్యగారూ అని పిలవలేవూ?—'

'మా కట్టాగే అలవాటండి!' మళ్ళీ నవ్వింది.

ఎంత నిర్లక్ష్యం!—పైగా ఆ నవ్వు నా ప్రాణాలు తోడేస్తోంది 'మాకు'ట, 'అలవాటు'—ట!

'నీ పేరు?'

"రంగమ్మగారండీ, 'రంగా' అని పిలుస్తారండి."

"రంగు లాగే వుంది!" దాని దర్జా చూస్తూ చూచి దాని అప్పియరెన్సు మరచిపోయి, బాత్రూమ్ కేసి నడిచా మను కున్నది మరిచిపోయి అలాగే నిలబడిపోయాను.

"ఆరు లేరాండీశ్?" అంది మళ్ళీ ఆ పనిమనిషి–'నీతో నాకేంపని!' అన్నట్టు; నేను 'అమ్మగారి'న్ని గ్రహించడానికి ఇష్టం లేనట్టు.

నా ఆలోచనలు విపరీతంగా పరుగులు పెడుతున్నాయి. దానికి జవాబు చెప్పకుండా లోనికి వెళ్ళాను ... ...

ఒంతో పేచీల్లేకుండా అంట్లు తోముకొని యిల్లు తుడిపించుకో గలిగితే నేను భారత ప్రభుత్వంలో ఏదేనా ఉన్నతోద్యోగం సంపాదించ గలనని అనిపిస్తోంది. ఏది ఎలా ఉన్నా ఇప్పుడు ఆ కేరియర్లో అన్నం తినాలి కాబోలు ... ముళ్ళమీద నించున్నట్టుంది ... ఆ మనిషి శుభ్రంగా లేదని కాదు ... ఎందుకో – నా కది నచ్చలేదు!

కాళ్ళు కడుక్కొని యింట్లో కొచ్చాను. 'పనిమనిషి' అప్పటి కప్పుడే కేరియర్ టేబిల్ మీద పెట్టింది. చీపురు పుచ్చుకు గది వూడ్చింది.

చూడ్డం మరిచి పోలేదు నేను–దాని పసుప్పచ్చని హవాయ్ చెప్పులు—అదుగో—ఆ మూల పెట్టింది; మా జోళ్ళు పెట్టుకునే చోటు!

చిన్న మంచంవాల్చి, దానిమీద పక్కవేసి పాపని జాగ్రత్తగా పడుకో బెడుతోంది నేను వెళ్ళేసరికి. "అరెరె!" అన్నాను కంగారుగా. నా పాపని ఈ మనిషి ముట్టుకోడం యిదే మొదటిమాటు. కేరియర్ తెచ్చిన చేతులు కడుక్కోకుండా పాపని తీసిందని చిరాకు వేసింది నాకు.

గోల చెయ్యొద్దన్నట్టుగా సంజ్ఞ చేసింది నాకు పనిమనిషి, పాపని జోకొడ్తూ. నేను మాట్లాడలేక పోయాను,

నా దృష్టి కేరియర్ మీద పడింది. మళ్ళీ 'ఇక్కడ కొత్తగా వేసిన వంటింట్లో పెట్టుక పోయినావా?' అన్నాను.

'ఉదయం ఇక్కడ ఉండిపోయింది. నేనే వెయ్యాలి అమ్మగోరూ. సాయంకాలాలు పొద్దు సెందలకాడే వొచ్చి, బంతెల్లు కడిగి ముగ్గేస తాను, వంట సిద్ధరుగాని.'

'సరే ఇహ అదొక్కటే తరవాయి, వొంటిల్లు కూడా కడ గాలి... అన్నం తింటున్నది చాలక!' అన్నాను.

'పడుకోక్కుండానే వంట సేస్తారెట్టా!'

నాకు నషాళం అంటుతోంది కోపం .. నాకు శుభ్రాలు మప్పు తోంది, ఇదెక్కడి పని మనిషి!

ఇటు తిరిగి, పెద్ద మంచం దగ్గిరకొచ్చింది దుప్పటి దులుపు దామని కాబోలు నడుం బిగించింది.

'సరేలే, అదలావుంచు!' అన్నాను.

వీధిలో అడుగుల చప్పుడైంది.

ఆయ నొచ్చేరు.

'హల్లో లక్ష్మీ, వచ్చేశావా! — వెరీ సారీ— టెలిగ్రాం యింతకుముందే అందింది. రైలు ఆ మాత్రం లేటవక పోతుందా అని స్టేషను కెళ్ళాను... పాపాయి నిద్రపోతోందా?' ఇదీ పలక రింపు... క్షేమంగా వచ్చేవా అని లేదు; అవస్థపడ్డావా అని లేదు!... కోపం వస్తోంది.

అటువేపు తిరిగా రాయన. పనిమనిషి చిరునవ్వు అటువేపు ప్రసరించింది. ఆయన దాన్నేమేనా అనడం పోయింది; తనూ చిరునవ్వు వెలిగిస్తూ, 'నువ్వు ఉన్నావా అమ్మగారొచ్చేసరికి ఇంట్లోనూ?'

'లేదండి. ఆరే ముందొచ్చినారండి ... ఎల్తానండి.' అనద

పేమిటి, చెప్పులు తొడిగేసుకుని చకచకా నడిచెయ్యడ మేమిటి, క్షణంలో అవతలికి వెళ్ళింది.

"అరె! వెడుతున్నావా? రంగూ!—" అంటూ ఈయన వీధి గుమ్మందాకా వెళ్ళేరు. "నీళ్ళూ ఆవీ పెట్టేవా అమ్మగారికి! అమ్మగారు స్నానం చేసిందా?—కాసేపుండి వెళుదువుగాని—రా!"

నా ఒళ్ళంతా చెమట్లు పోస్తున్నాయి.

మర్నాడు—

సాయంకాలం అయిదు దాటేసరికి ఆయన ఆఫీసునుంచి వచ్చేశారు పనిమనిషి పెరట్లో పని పూర్తిచేసేసి గదులు రెండూ తుడుస్తోంది. పడక గదిలోకొచ్చి పెద్ద మంచంమీద పడక సరిచెయ్య బోతోంది.

'అదలా ఉంచు' అన్నాను.

'ఏత్తా లెండమ్మా తవఁరి కెందుకు శ్రవఁ!' అంటూ దుప్పటి తీసింది.

నా కిష్టంలేదు.

పనిమనిషి చేత గిన్నెలు తోమించడం, యిల్లు వూడ్పించడం, షాపు దుకాణానికి పంపి ఏవేనా వెచ్చాలు తెప్పించుకోడం—యిలాటివన్నే తప్ప పక్కలు నే నెప్పుడూ వేయించలేదు.

నెలకి నాలుగైదు రూపాయలిచ్చి పనిమనిషిని పెట్టుకుంటాం. పెట్టుకునేటప్పుడే వాళ్ళు చెయ్యవలసిన పన్లు నిర్ణయించుకుంటాం. అందులోకి పక్కలు వెయ్యడం, కట్టు విడవు గుడ్డలు తడపడం, తాగే నీళ్ళుతేవడం, యిలాటివి కొన్ని వెళ్ళవు. మా యింట్లో. దానికి ప్రత్యేకమైన కారణం లేకపోయినా — పనిమనుషులు శుభ్రంగా ఉండరనీ, వాళ్ళు చేసే ప్రతీపనీ మళ్ళీ మనం ఫినిష్ చేసుకుంటేగాని

పనికిరాదనీ - ముష్టిలోపుండే సామాన్యమైన కాయితం. మాటు వరసకి, పనిమనిషి తోమి ఇచ్చిన గిన్నెలు మళ్ళీ కడిగితే గాని వంటింట్లో పెట్టుకోను నేను.

అదీగాక మా పక్కలు నేను వేసుకోగలను. "శయ్యా సవరించడం" ప్రత్యేకం నావల్ల జరగవలసిన పని అని నా నమ్మకం. "పడక" మీద నాకొక ప్రత్యేక గౌరవం వుంది.

"ఏ శ్రమా లేదు. అల్లావుంచు. వేరే పనేదైనా చూసుకో."

"పన్లన్నీ అయిపోనాయి గదండీ." అని నవ్వింది పనిమనిషి.

అది నవ్వితే నా కెలాగో ఉంటోంది...

మొత్తంమీద అలా వదిలి ఇవతల బడింది.

ఆయన ఇదంతా గ్రహించాను సుమా అన్నట్టు—"రంగమ్మ శుభ్రంగానే చేస్తుందె! పక్కలూ వేయించేస్తూ ఉండు. ఇన్నాళ్ళూ అదే వేస్తోందిగా!...దాని పని నీకు నచ్చలేదాఁ?" అన్నారు.

"మునుపటి పనిమనిషేమైంది?" అన్నాను నేను జవాబు చెప్పక.

"నువ్వెళ్ళిన తరవాత మానేసిందది; మధ్యాహ్నం పన్నెండు దాటేక కేరియర్ తెమ్మంటే నాకా హొటళ్ళు తెలియవంది. ఓ రోజు దాన్ని రిక్షాలో కూర్చోబెట్టి, కూడా సైకిలేసుకెళ్ళి చూపించేను—ఆ రాత్రి దారి మరిచి పోయానయ్యగారూ అంటూ తొమ్మిటన్నర చేసింది—అప్పుడు దీన్ని పెట్టుకున్నమాట—కొంచెం ఎక్కువే అడుగుతుంది గాని శుభ్రంగా చేస్తుందటే—మంచి చురుకైన మనిషి కూడాను."

"ఎంతిస్తున్నారేమిటి?"

"ఎనిమిదీ"

"అ...వ్వ!—ఎనిమిదే!—ఆ సిల్కుచీర నాదేనా?—మీరే యిచ్చారా?"

'ఆఁ—కేరి అన్నోళ్ళునుండి గనూ—మొన్న వొచ్చి అడిగితే, సరే పాత చీరేగదాని యిచ్చాను!'

"ఎంత బావుందండీ! — ఇంతోటి పనికి నెల కనిమిది రూపాయలు గాక సిల్కు చీరలు గూడానా!—ఇంతకీ ఏమిటి పని—మహా!"

"పొద్దున్న వొస్తుంది—స్నానానికి నీళ్ళు కాచడం, తోడడం, మంచినీళ్ళు తేవడం, రాత్రి తిన్న కేరియర్ కడగడం, ఇల్లు వూడ్చడం! మధ్యాన్నం నే నొచ్చేసరికి కేరియర్ తెచ్చిపెట్టడం—"

"మరి తోమడానికి వంట గిన్నెలైనా లేకుండా ఎనిమిది రూపాయి లేమిటండీ! — ఇదివరకు పనిమనిషికి అయిదేగా యిచ్చాం!"

"ఆ కండిషన్ మీదే ఎపాయింట్ చేసేను. నువ్వు వస్తే వంట గిన్నెలూ తోముతానంది-"

"ఎంత పనైనా పొద్దుటే కదండి - ఒక్కపూట పనికి ఎనిమిదా?"

"పొద్దుటేమిటి—సాయంకాలం మాత్రం—అయిదు గంటలకి వచ్చి, మధ్యానం తిన్న కేరియర్ కడగడం, హోటలుకెళ్ళి భోజనం తేవడం —" అంటూ చదువుతున్నా రాయన.

"—పక్క వెయ్యటం—!" అన్నాను నేను, ఒళ్ళుమండి.

"మరి పక్క వెయ్యొద్దూ?— నేను వేసుకుంటానా ఏంటి, లేకపోతేను!"

"చాల్చాల్లెండి. పక్కలు అందరికీ వెయ్యక్కర్లేదు. నే నే వేసుకుంటాను—ఇంకాసయం!..." ఆ తరవాతి మాట అన్లేదు నేను.

"సరే నీ యిష్టం. నాకేం పోయింది—? ఇంతా పన్లేదని

నన్ను దెప్పిపొడిచీ దాన్ని ఊరికే కూచోబెట్టి ఎనిమిది రూపాయలూ ఇచ్చేటట్టున్నావు !" అని అవతలికెళ్ళా రాయన.

పక్క తీసి దులిపాను. దిండు గలేబు మాసినట్టుంటే మార్చి ఇంకోటి తొడుగుదామని వొంగాను. మంచానికి గోడకీ మధ్యన దుమ్ము పేరుకొని వుంది... ఏమిటి దీని శుభ్రం! అని వెటకారంగా అనుకుంటూ చీపురు తెచ్చి, మంచాన్ని కొద్దిగా యివతలికి లాగి, మూలనుంచి మొదలుపెట్టి తుడవసాగాను... అక్కడేవో గాజు పెంకులు... కాదు, చేతి గాజుల ముక్కలు... తన్నెల్లనా ఎప్పుడో నా చేతివి పగిలి పడ్డాయి కాబోలు, ఇంకా అలాగే వున్నాయి .. శుభ్రం శుభ్రం అనుకోడమేగాని పనిమనిషి శుభ్రపరిచింటే నా మొహం! — అంతా రంగు !, పైపూత ! - తుడుస్తున్నాను; ... వెలుగులో పడ్డాయి గాజుల ముక్కలు...

ఏమని చెప్పను !... అవి నా చేతి గాజులముక్కలు కావు !... అయ్యో, అవి ఆ పనిమనిషి చేతిని నేను చూస్తున్న ఎర్రటి గాజుల ముక్కలు !

ఛీ-!

నా మనస్సులో తుపాకులు పేలుతున్నాయి. పడక గదిలో, మా ఆయన పడుకొనే మంచం సందున, అలాటి గాజుముక్కలు ఆ మనిషివి— ఆ రంగువి— ఉండడమా? - దీనర్థం ఏమిటి ?

చేతిలో చీపురుకట్ట జారిపోయింది. ద్వారం వరకూ చీపురుతో తరుముకొచ్చిన దుమ్మూ, అందులోంచి ఎర్రగా మెరుస్తూన్న ఆ గాజు ముక్కలూ నన్ను వెక్కిరిస్తున్నాయి. అవి ఎత్తి అవతల పారబొయ్యటానికి చేతులు రావడం లేదు. ఏవో చెప్పరాని ఆలోచనల్లో మనస్సంతా మలినమైపోతోంది. కోపంతో ఒళ్ళంతా చెమటలు పోస్తున్నాయి.

ఐయిదు నిముషాలైంది. చేసుకోవలసిన పని చూచుకొని పొంగుతున్న ఉద్వేగాన్ని అణుచుకున్నాను. కొంచెం తేరుకున్నాను, ఒట్టలపెట్టె తెరిచి దిండు గలీబు ఒకటి తీసి, మళ్ళీ మంచం దగ్గర కొచ్చాను. మాసిన గలీబు విప్పుతున్నాను... ఏమిటోగాని ముడి ఊడొచ్చినా తాళ్ళు వేరవక అలా పట్టుకున్నాయి.

ఏమిటా అని గట్టిగా లాగాను. ఒక వెంట్రుక—తెగి రెండు ముక్కలూ రెండు చేతుల్లోకీ వచ్చాయి... అప్రయత్నంగా ఆ వెంట్రుక పొడుగుని పరిశీలించుకొన్నాను. అది పొడుగాటిది... నాది అంత పొడుగైన జెడకాదు.

అది ఎవరి తల్లోది అయిందీ ఊహించడానికీ నా కాట్టేసేపు పట్టలేదు.

నాకు నిస్సత్తువ వచ్చింది. అలాగే చతికిలబడి పోయాను. ఏడుపు వచ్చేస్తోంది.

నాలుగు రోజులైంది.

మర్నాటికి పేరంటానికి నలుగుర్నీ పిలవడానికి వెళ్ళి ఆరు గంటలు దాటాక ఇంటికొచ్చాను. తలుపుకొట్టాను ఎంత సేపటికీ తియ్యలేదు. మా ఆయన... దబదబా కొట్టడం, కాసేపు నుంచోడం—ఇలా పది నిమిషాలకి పైగా అయ్యాక అప్పుడు తలుపు తెరిచారు:

'ఎంత సేపయింది వొచ్చి—? పెరట్లో వున్నాను' అన్నారాయన.

'ఎంత సేపేమిటీ? — అరగంటైనట్టుంది! ఇంత సేపుటుండీ, ఎంత పెరట్లోకి వెళ్ళినా! — బ్రహ్మదేముడి పెద్దన్నయ్యలాగ!' అన్నాను విసుక్కుంటూ.

కుంకం బరిణా, పట్టు రుమాలూ పెట్లో పెడదామని పడక

గదిలోకి వెళ్ళాను. ఈ వేళప్పుడు అగరొత్తుల వాసన వేస్తోందేమా అని ఆశ్చర్యపడ్డాను.

ఆయన "పిలవటాలన్నీ అయినట్టేనా?" అని ఏదో పరామర్శిస్తూ లోపలకు రాబోయారు. 'అవతల ఉండండి.' అని తలుపు గడియవేశాను. సాదా చీర వొకటి తీసి కట్టుకున్నాను. కిందపడ్డ పట్టుచీర తీసి మడత పెట్టుకుంటూ వుండగా మంచంకింద తలవేపున పడివున్న రెండు చేమంతి పువ్వులు నా దృష్టి నాకర్షించాయి... అప్రయత్నంగా నా మనస్సు ఆలోచనలో తేలిపోసాగింది... చేమంతులు నేనూ పెట్టుకున్నానుగాని — నా తల్లోవి రాలడానికి వీల్లేదే!—దండ గుచ్చుకునేలోగా పడ్డాయా?...ఏమో! అవి ఎవరి తల్లోవి?—

నా కాలోచించడానికి భయం వేసింది...ఈయన తలుపు తియ్యడానికి అంత ఆలస్య మెందుకైంది? ఈ చేమంతులకీ, ఈ అగరొత్తులకీ, ఆ ఆలస్యానికి కారణం ఒకటేనా? ... గబగబా తలుపుతీసి అవతలకి వెళ్ళి అటూ ఇటూ చూశాను. రోడ్డుమీద అనుమానించతగ్గ వ్యక్తి కనిపించలేదు...భ్రమా?...అర్థంలేని అనుమానమా?...సందు తిరిగి వెళ్ళిపోయిందేమో!?

దడదడా కొట్టుకుంటోంది గుండె. కోపం, అసహ్యం, అసూయ, నన్ను వెర్రెత్తిం చేస్తున్నాయి. ఆయన్ని...అడగడానికి అనేక ప్రశ్నలు మస్తిష్కంలో తయారై నాట్యమాడు తున్నాయి. ఆయన నాకేసి వెర్రిగా చూస్తున్నా రప్పుడే.

"ఏమిటి లక్ష్మీ?"

"టయిమ్ ఎంతైందండి" అన్నాను గబుక్కున.

'ఆరు!'

"ఈ పనిమనిషి ఇంకా వొచ్చినట్టు లేదు! — షోకులు యిడీన్నూ" అన్నాను. దొంగచాటుగా ఆయనవేపు చూస్తూ.

ఆయన నిర్లక్ష్యంగా "పని మనిషా ? — రానూ వచ్చింది. వెళ్ళనూ వెళ్ళింది !" అన్నారు.

"ఎంత సేపైంది ?"

"అబ్బో, చాల సేపైంది !" అని క్షణం ఆలోచించి "నువ్వు వెళ్ళిన పది నిమిషాలకి వచ్చింది. వచ్చిన పది నిమిషాలకి వెళ్ళింది" అన్నా రాయన.

ఆబద్ధా లాడుతున్నారు. రంకు నేర్చింది బొంకు నేరుస్తుందన్న సామ్యం నిజం చేస్తున్నారు... తెలుస్తూ నే ఉంది...

కాళ్ళూ చేతులూ కడుక్కొని వంటింట్లోకి వెళ్ళాను. అగ్గిపెట్టికోసం చూశాను. లేదు. అగరొత్తులు వెలిగించారుగా ! గదిలో ఉందేమో చూదామని వెళ్ళేను.

నా వెనకాలే పెరట్లోకి వచ్చా రాయన. మళ్ళీ నా వెనకాలే గదిలోకి వచ్చారు. నా చర్యలూ భావాలూ గమనించి నేనాయన్ని అనుమానిస్తూన్నానో లేదో తెలుసుకోవాలని కాబోలు !

డ్రసింగ్ టేబిల్ మీద వుంది అగ్గిపెట్టె. కాటుక మరకలు సరిదిద్దుకునే నెపంతో అక్కడే కాసేపు కూచున్నాను. ఆయన గది ద్వారం దగ్గిర నుంచున్నారు...ఏదో జరుగుతుందనీ జరగాలనీ ఉంది నాకు. ఎవరు ప్రారంభిస్తారో ! నేను సిగ్గు విడిచి ఎలా ప్రారంభించేది ?

అద్దంలో చూచుకున్నాను.

వురుడు పోసుకొని రావడం, ఎండలూ నన్ను పాడు చేశాయి...బుగ్గలు తీసేశాయి. పై పెదవి పైకి లేచిపోయినట్లై, పళ్లు కనిపిస్తామని బెదిరిస్తున్నాయి...జ్యోతుల్లా వెలిగే కళ్లు తెలుపు పడి కాటి కన్నుల్లా వున్నాయి.

మరీ యీవాళ - రెండు గంటలసేపు తిరిగి తిరిగి రావడమూ, రాగానే ఆ పని మనిషితో ఆయన జరిపిన ఆ అమానుష అన్యాయ

చర్య తెలియడమూ, ఈ నాలుగు రోజుల్నించీ నేను పడుతున్న బాధని బైటికి తెచ్చి, ఖర్లేంతో చూపిస్తున్నట్టుంది.

ఆరునెలలు నేను లేకపోయేసరికి ఎంతపని చేశారీయన!... ఎంత సిగ్గు మాలిన పని! ..ఎవరితో చెప్పుకోను?...ఏమని చెప్పను!

ఆ పనిమనిషి! 'రంగు'ట దాని పేరు రంగు... వెలిసేవరకంతా మేలిమి గానీని, రంగొచ్చిందంతా బంగారం కాదని - ఎప్పటికి తెలుస్తుందో ఈ మొగాళ్ళకి!

ఆ మనిషి నా కంటే బాగుందా?...ఏమో! బాగుండట మంటే ఏమిటి?...బాగుండడం అనే మాటకి ఎవరర్థం వారిది! ఆ నలపింపి రంభ—అన్నారు అందుకే కాబోలు!......నా సంసారంలో చిచ్చు పెట్టడానికి ఆ రంగులేని రంభ ఎక్కడ దాపరించిందో!...ఈయన బుద్ధేమైంది? ..నేనంటే ప్రాణాలు పెడి తేస్తా నన్నట్టుగా ఉండే ఈయన-దానివల్లో ఎలా పడ్డారో! ..మళ్ళీ నన్ను మునుపట్లా చూసుకుంటారా ఈయన?... నే నాయన్ని ఆకర్షించ గలనా? నా కేమిటి దాని?

పనిమనిషిని మార్చేస్తే?... ఎవరైనా ముసలిదాన్ని వెతికి తెచ్చి పెట్టుకుంటే బాగుణ్ణు...ఈ పనిమనిషి గుండెలమీద కుంపటిలా నా సంసారంలో ప్రవేశించింది. మొగుడూ ముద్దులూ లేనట్టుంది దీనికి! ఆ చెప్పులూ, సిల్కు చీర్లూ, బంగారపు గాజులూ, దాని షోకులూనూ! పనిమనిషి లక్షణాలు వెతికినా లేవు దానికి, జమీందారీ లక్షణాలు తప్ప. డబ్బెలా వస్తోందో దానికి వీటన్నిటికీను?

డబ్బు కూడా యిస్తున్నారేమో ఈయన దానికి!.. సేవింగ్సు బ్యాంకి ఎకౌంట్ చూడాలి...ఎంత సిగ్గులేని పని! ... పరువుగా పెద్ద ఉద్యోగం చేసుకుంటూ కూడా ఇలాంటి నీచమైనపని . చెయ్యడానికి ఈయనకి మనసెలా ఒప్పిందో!

నేను వచ్చి నాలుగైదు రోజులైంది కదా!...పోనీ నేను లేనప్పుడేదో మనస్సు సరిలేక ఏదో పొరపాటు చేసేరేమో అనుకుంటే—

నే నుండగానే... నే నలా పేరంటానికి వెళ్ళి వెళ్ళగానే—ఇక్కడ ఈ భాగోతం—! ఎంత అసహ్యకరమైన పని,—ఎంతకైనా తెగించా గన్నమాట! ...ఛీ. ఈయన మొహం ఎలా చూడను!

మొహం తువ్వాలతో తుడుచుకొని అద్దంలోకి చూస్తే అందులో నా వేపు చూసి నవ్వుతున్నారాయన. అది తప్పించు కుందా మని దృష్టి ఇటు మళ్ళించేను. ఇక్కడా అయనే: అ నవ్వే... చూసుకున్నావా. నీ అందం? చూశావా, నీ కన్నా అది ఎంత అందమైందోను!—ఇప్పు డేమంటావు? అణిగిందా నీ పొగరు?— అన్నట్టుంది. ఆ నవ్వు...సిగ్గులేని మొహానికి నవ్వే శృంగారమట?- ఆ నవ్వుకి బదులు నేను నవ్వుతానా?—చురుగ్గా మొహం యింకో వేపుకి తిప్పేసుకున్నాను—నా మొహంలో అసహ్యం అయనకి కన బడి వుండాలి.

"చాలా బావున్నావు లక్ష్మి, నువ్వివాళ!" అన్నారాయన.

నేను మాట్లాడలేదు. నన్ను పొంగ వెయ్యడానికే అలా అన్నారు. అ ంతమాత్రంలో జరుగుతున్నదంతా మరిచిపోతాననిగాబోలు. అయన ఉద్దేశం!

"ఎటాంగ్" అయిపోతావని భయపడి పోయాను సుమా!" అంటూ దగ్గరి కొచ్చేరు.

"నే నెలా అయిపోతే మీ కేం?" అని విసిరికొట్టాను మాట.

మళ్ళీ నవ్వారాయన, "కోపం వొస్తే యింకా బావుంటావు సుమీ!"

ఎంతమంది పురుషులు ఎంతమంది స్త్రీలతో అన్నారో, ఈ మాట!—ఈ అర్థంలేని మాట—కోపం వొస్తే ఇంకా బావుం డడం!—అసలీయనే ఎంతమందితో అన్నారో!—

"..జం, వొట్టు! శ్రావణ లక్ష్మిలా ఉన్నావివాళ!" అంటూ నా నడుంచుట్టూ చెతులు వేశారు...నిండా అరగంట కాలేదు; ఆ

చేతుల్లోకే ఆ పనిమనిషిని... రామరామ!... నాకు ముళ్ళకంచె గుచ్చుతున్నట్లుందిగాని ప్రియపురుష స్పర్శలా లేదు... ఆ మనిషి మా యిద్దరి మధ్యా ఎంత దూరం సృష్టించకపోతే ఆయన చేతుల్ని అంత వెంటనే తొలగించ గలిగాను!... ఆ చేతుల్లో పరవశం పొందే నా హక్కు పోగొట్టేస్తున్న పాపాత్మురాలు. దుర్మార్గురాలు. రంగమ్మ'- నవ్వుతుంది, మళ్ళీనూ, ఏమీ ఎరగనట్టు... !... ఎరగనట్టుండే వాని నవ్వు నన్ను సవాల్ చేస్తున్నట్టే వుంటుంది !—చూశావా, నా తడాఖా !-అని.

ఆయన చిరునవ్వుతో మళ్ళీ నన్ను పొదివి పట్టుకున్నారు. ఎడం చెయ్యి నా వీపు మీదుంచి కుడిచేత్తో గడ్డం ఎత్తుతున్నారు... బలీయమైనకోర్కె, విపరీతమైన అసహ్యం 'నే' నంటే 'నే' నని నాలో విజృంభించి యుద్ధం చేసుకుంటున్నాయి. నేను నీరసపడి పోతున్నాను... నా తల వాలి పోయింది...

"లేవండి. నేను వంట చేసుకోవాలి!" అంటూ విడిపించుకున్నాను.

"ఇంకా ఒంట్లో సరిగా ఉండడంలేదా!" అని లాలిస్తూ అడిగి విడిచి పెట్టారాయన... అంతా నటన! నిర్లక్ష్యం!

"భగవంతుడా! నాకీ కాన్పొకటి సృష్టించి పుట్టింటికి పంపించే ఏర్పాటుచేసి ఇంత అన్యాయం చేశావా?—ఈ వూళ్లో ఆసుపత్రి లేనట్టు అక్కడి కెందుకు వెళ్ళాను. తెలివి తక్కువ పెద్దమ్మనై! ఆసుపత్రి లేకపోతే అరడుగుల తాడు లేకపోయిందా?" అని నాలో నేనే కుంపటి దగ్గిర కూచుని కుమిలిపోయాను.

రోజులు గడుస్తున్నకొద్దీ ఆయనకీ నాకూ మధ్య పెరుగుతున్న దూరం భయంకరమైపోతోంది... నా వంట్లో ఇంకా సరిగా లేదని తేల్చేశారుగా, ఆయన! ఇదంతా ఎందుకో తెలుస్తూనే ఉంది!

రాత్రి భోజనం కాగానే 'కిళ్ళీ వేసుకొస్తానే' అంటూ ఆ పంచెతోటే ఎటో వెళ్ళారు ఆయన. తొందరగానే వస్తారుగాని... ఏమో! దానిల్లు దగ్గరే నేమో! ... ఎంతసేపు కావాలి!... ఆపైన వూహించడానికే భయమూ, సిగ్గూ, అసహ్యమూ వేస్తాయి.

రాత్రిళ్ళు చాలా సేపటివరకూ నిద్ర రావడంలేదు. పాపాయి పక్కన పడుకోడం కొత్త అలవాటు ... పాపాయిమీద కాలో చెయ్యో వేసేస్తానేమో... అదెక్కడ నలిగిపోతుందో అని దిగులూ; పైగా ఎంచం మరీ చిన్నదిగా వుండడం ... పెద్ద మంచంమీద చాలా ఖాళీ వుంటుందిగాని - సమయానికి అభిజాత్యమో, అసహ్యమో ప్రాణాంతకంగా ఆవేశిస్తాయి... యదాలాభంగా ఆయన స్పర్శ తగిలేతే ఉలిక్కి పడుతున్నాను - పవిత్రమైన ఆ స్పర్శ ఇప్పుడేది?

ఎలాగో కళ్ళు మూసుకుంటే ఏ కల్లోనో కనిపిస్తుంది, ఆ "రంగు!" దాని వికటాట్టహాసంతో, హేళనా పూర్వక సంభాషణతో నా మనస్సు ప్రతిధ్వనించి బీభత్సమయిపోతుంది.

వారం రోజులైంది.

ఆయనెక్కడికో క్యాంపు వెళ్ళారు. అయిదు రోజులవరకూ రారు.

ఏమీ తోచక కొత్తపేట వెళ్ళొద్దామని బయల్దేరాను. ఎక్కడో ఊరికి అవతలవేపు చివర్న ఉంది ఈ కొత్తపేట; మామూలుగా వెళ్ళడంవేపడదు. మా మేనమామ కూతురుగారిల్లు వెతుక్కుంటూ రిక్షాలో వెళ్ళాను. నాలుగు నెల్లక్రితమే వాళ్ళువూరు ట్రాన్స్ఫరై వొచ్చారు ఒక పెద్ద యిల్లు చూపించి ఇదేనండీ వారిల్లు అని చెప్పా డొక అబ్బాయి.

ఆ పెద్ద యింట్లో వాళ్ళొక్కరే వుంటున్నారట ప్రస్తుతం. ఎవరో వొక ఆఫీసరుగారూ, వీళ్ళూ కలిసి మొత్తంగా ఇల్లంతా డెభ్భై రూపాయలకి తీసుకున్నారుట. అంతా మూడురోజుల్లో వాళ్లు ట్రాన్స్‌ఫరై వెళ్ళారట... 'ఈ నెలాఖరువరకూ అద్దె యిచ్చి వెళ్లారు వాళ్ళు. మేం ఈలోగా ఇంకో ఇంటికి మారాలి. మీ వేపు ఏవైనా ఇళ్ళు ఉంటే చూడు...' అంది మా ఒదిన.

'మీ రెంత యిస్తున్నారు ?'

'ముఫ్ఫయ్యయిదు.'

నా సమస్య పరిష్కారమయ్యే మార్గం కనబడ్డట్టు ఆనందం కలిగింది...

ఒకటి రెండుసార్లు ఆయనతో అన్నాను... ...'పనిమనిషిని మార్చేద్దాం అండీ' అని—ఆయన ఒప్పుకోలేదు.

"నిష్కారణంగా ఎందుకు మాన్పించాలి?... పని శుభ్రంగానే చేస్తోం దంటావు. ఆలస్యంగా రావడంలేదు. దొంగతనం యెరగ దంటావు. చురుకైందే అని వొప్పుకున్నావు. పోనీ నాగాలు పెట్టడం లేదు... ఎందుకు మార్చాలి ?... ఇంతా చేస్తే పాపాయి కూడా అలవాటైపోయి అదొస్తే ఊరుకోడం. అది తీసుకెళ్తే ఏడవకపోడం తెలిశాయి. ఉట్టి పుణ్యానికి దాని నోటిదగ్గిర అన్నం ఎందుకు పడ గొట్టాలి ?' అన్నా రాయన.

అన్నీ నిజమే.

పైకి చెప్పదగ్గ కారణంలేదు.

కాని నేను వాళ్ళిద్దరి మధ్య వున్న కలుషిత సాంధవ్యాన్ని క్షమించలేను, మార్చలేను. రుజువు చెయ్యలేను !... ... వాళ్ళు ఏమాత్రం అజాగ్రత్తగా ప్రవర్తించడం లేదు... కాని నేను కలగ

జేసుకొని యేదో వొకటి చెయ్యకపోతే దీనికి అంతూ పొంతూ ఉండదు.

అయితే ఆయన సంగతి నాకు బాగా తెలుసును. చెయ్య దల్చుకున్నది ధైర్యంగా చెయ్యడమూ, చెప్పదల్చుకున్నది నిర్మొహమాటంగా చెప్పడమూ ఆయనకి బాగా చేతనవును. 'నా ఇష్టమ్' అన్న సమాధానం ఆయన నాలుక చివర్ని రెడీగా వుంటుంది. అంతే గాదు. ఎవరైనా ఇలా నిర్మొహమాటంగా, నిర్భయంగా ప్రవర్తిస్తే చాలా మెచ్చుకుంటారు కూడానూ.

నే నాయనతో కజ్జా పెట్టుకొని ఎన్నడూ ఏదీ సాధించలేను... దేనిమాట ఎలా వున్నా ఈ విషయం అసలే వీల్లేదు; 'నిజమే! నీకు గనక గ్రహించడానికైనా యిన్నాళ్ళు పట్టింది... ...నా యిష్టం! ఏం చేస్తావు? నువ్వెక్కడ, అదెక్కడ? దాని అందంలోగాని, బలంలోగాని పదోవంతయినా నీకున్నాయా?' అని ఆయన అనేస్తే?

వెర్రెత్తిపోయీ, కోపం చేసుకునీ, అలిగీ, ముభావంగా వుండీ నేను చెయగలిగిం దేమీ లేదు... ఒక సీన్ క్రియేట్ అవుతుంది. అంతే... ఎవరితో చెప్పినా మరింత ప్రచారం. దాని మూలంగా అవమానం తప్ప వేరే ప్రయోజనం లేదు—పనిమనిషి, నాకన్నా అందంగా వుందన్న కారణంచేత అల్లరి జరగడం—వూహించడానికే భయంగా వుంది... ఆలస్యం చేయడానికి వీల్లేదు... ఆలస్యం అవుతున్నకొద్దీ ఆయన నాకెంత దూరమయ్యేదీ, దానివలన నేనెంత నష్టం పొందేదీ కనిపిస్తూనే ఉంది.

"ముప్ఫయ్యయిదు మీ రిస్తే మిగిలిన ముప్ఫయ్యయిదూ మేమిచ్చి యీ వాటాలో ఉంటామే. అంచక్కా ఇద్దరం కలిసుందాం... మీ రిల్లు మార్చకండే" అని చెప్పేను.

ఆ సాయంత్రం దగ్గిరుండి యిల్లు వాళ్ళ పనిమనిషిచేత కడిగించేసి, మర్నాడు ఆఫీసుకి కబురు చేసి జవాను సాయంతో యిల్లు మార్చేశాను.

మా ఒదిన ఆశ్చర్యపడింది ! "ఇదేమిటే, మీ ఆయన్ని అడక్కుండానే ?"

"మా ఆయన సంగతి నీకు తెలీదు." అన్నాను.

ఈ యింటికి రంగమ్మ యిల్లు చాలా దూరం. ఎనిమిది రూపాయలకోసం ఆశించి అది పనికి యింత దూరం రాదు. 'కిళ్ళీ వేసుకొస్తానే' అని ఆయన వెళ్ళిరాగల దూరం కాదది.. పైగా, మా ఇల్లూ దా నిల్లూ ఒకే పేటలో వున్నట్టయితే ఆయన దానింటి దగ్గిర తిరిగితే తప్పుపట్టరు కాని, యింతదూరం నుంచి కూడా ఆయన అక్కడికి వెళితే జనం మొహంమీదే అడుగుతారు... .... మొహం తప్పిపోతే మోహం తప్పుకుంటుంది. వ్యామోహం తగ్గిపోతే తరవాత ఆయనకే తెలుస్తుంది: నిజమైన విలువ ఏమిటో, ఎవరిదోను—

ఆయన్ని నే నేమీ అనకుండా, ఘర్షణ పడక్కర్లేకుండా నిశ్శబ్దంగా గడుసుగా సమస్య పరిష్కరించుకున్నందుకు నన్ను నే నెంతో మెచ్చుకున్నాను.

"ఏమిటి లక్ష్మీ ఇలాచేశావు. సడెన్‌గా !" అన్నా రాయన ఇంట్లోకి వస్తూనే. నేను నవ్వాను.

ఆయనా నవ్వారు. "నీ కా యిల్లు నచ్చలేదా ?—నాతో మాట వరసకైనా చెప్పేవు కాదేం?"

'ఈ ఇల్లు చూసి చెప్పండి మీరు. బావుందా, లేదా ?— మూడు గదులూ వ టిల్లూ, యింట్లోనే పంపూ. అద్దె అక్కడా యిక్కడా ఒకటే .. పైగా మీ ఆఫీసుకి దగ్గర! వేసంకాలం ఒస్తే డాబాకూడా ఉంది. బావులేదూ ?'

'బాగానే ఉ ది—' అని, మళ్ళీ నవ్వారాయన. ఆ నవ్వులో ఆశ్చర్యమే వుంది. 'నేను క్యాంప్‌నుంచి వొచ్చేవరకైనా ఆగలేక పోయావా?—పోనీ నీ మాట ఎప్పుడైనా కాదన్నాను గనకనా?'

'కాదంటారని కాదుగాని...అసలు కాదనరనేగా ! ఊరికే మా ఒదిన్ని చూదామనొస్తే పోర్షన్ ఖాళీగా వుంది... పోనీ ఒకళ్ళ కొకళ్ళు సాయంగా ఉంటాంకదా అని—ఇంతకీ మీకు నచ్చిం దంటారా లేదా ?'

'నచ్చిందిలే... ...ఇక్కడ దోమలు కూడా అట్టే లేనట్టు న్నాయ్' అంటూ దూలాల వేపూ, కిటికీలవేపూ పరీక్షగా చూస్తు న్నారు ఆయన. ఆయనతో ఏదో చెప్పాలని మహా ఉంది నాకు... ఆయన మొహంలో మార్పేమీ లేక పోవడం నాకు ఆశ్చర్యంగా వుంది...పని మనిషిని పూర్వంలా కలుసుకునే అవకాశం లేకుండా చేసినందుకు ఆయన మొహంలో నేననుకున్న మార్పు రాదేం ? స్వతంత్రించి యింత పని చేసినందుకు నన్నేమీ అడగరేం?...ఏం అడుగు తారా. ఎంత గట్టిగా అడుగుతారా, దానికెలా సమాధానం చెప్పాలా, అని నాలుగు రోజుల్నించి నా ఆలోచన.

ఆ సాయంత్రమంతా ఆయన నన్నేమీ అడక్కపోతే ఆశ్చర్యం వేసింది : రాత్రి భోజనాలుచేసి ప్రక్క దగ్గర చేరాక నవ్వే ఒచ్చే సింది నాకు.

మంచం మీద ఏటవాలుగా శేషతల్ప శాయిలా పడుకొని విలాసంగా తమలపాకు అందుకొంటున్నారాయన. సున్నం రాసి ఈనెలు తీసి చిలకలు చుట్టి అందిస్తున్నాను. నేను ఆఖరాకు అందిస్తూ "అసలు ఇల్లెందుకు మార్చానో చెప్పరాండీ?" అన్నాను సన్నగా నవ్వుతూ.

ఆయన నవ్వారు. 'ఎందుకేమిటి?'

'పార్శ్వపు నొప్పికి భాస్కర లవణం–' అన్నాను, మంచం మీద చోటు చేసుకు కూచుని, పొడుపు బాడీచిన విలిపి తనంతో.

'అదేమిటది?' అన్నారాయన: నా చెయ్యి పట్టుకుని, గాజులు వెనక్కి ముందుకి సర్దుతూ.

'చెప్పుకోండి చూద్దాం!'

'...ఏమిటి చెప్పుకోవటం! – ఆయన కెప్పుడో నాకు పార్శ్వపు నొప్పివస్తే అజీర్ణంమీద వచ్చిందని భాస్కర లవణం యిచ్చారు... దానిమాటేనా నువ్వు చెబుతున్నావ్!...దానికి దీనికి సంబంధమేమిటి?'

'అదే, చెప్పుకోవాలి మరి!

'నువ్వే చెబుదూ నాకలా కలపడం చేత గాదు!'

'– చెప్పమంటారా?...అక్కడ మీరు చిక్కిపోయారండీ పొటలు మెతుకులూ, పనిమనిషి చేతి నీళ్ళూ...ఆర్నెల్లలో ఎంత మార్చేసిందండీ మిమ్మల్ని! ఛీ పాడుమనిషి!' అన్నాను, నవ్వుతూ. గోముగా ఆయన మీదికి వొంగుతూ.

మా ఆయన ఒక్క నిమిషం మాట్లాడకుండా వూరుకున్నారు. నేనూ ఊరుకున్నాను.

ఆయన లేచారు. కిటికీలోంచి తమలపాకుల పిప్పి వుమ్మేసి, లైట్ ఆఫ్‌చేసి మంచంమీద కూచున్నారు...

'అర్థంలేని అనుమానాలే పడ్డావుగాని తెలివి తేటలు ఉపయోగించావుకాదు... నే నెలాటి వాణ్ణో తెలిసుకోలేక పోయావన్న

మాట. అసలలాంటివి నేను ఆలోచించుకోవాలేగాని-ఏదేనా అయితే నన్ను నువ్వు అపగంఒననే అనుకున్నావా !'

అందులో నిజమెంతో, ఆయన మొహంలో భావం ఏయిలాంటిదుందో తెలునుకోవాలనీ, చూడాలని ఉంది నాకు...

కాని నేను లేచి దీపం వెయ్యలేదు. కనుక్కోవాలని నాకేం పట్టుదలా యేమిటి ? నేను చీకట్లోనే నవ్వుకున్నాను.